



కూలిన బతుకులు : ప్రమాదంలో మృతులు

ఓట్ల ఉప్పెన

జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ 80.31%

- 2014, 2019 అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే ఈసారి భారీ పోలింగ్
- జిల్లాలో 16,34,122 మందికి 13,12,297 మంది ఓటుహక్కు వినియోగం
- 8,29,471 మంది మహిళా ఓటర్లలో 6,59,596 మంది ఓటేసిన వైనం
- పురుష ఓటర్లు 8,04,465కిగాను 6,52,599 మంది ఓటు వేసిన వైనం
- గత ఎన్నికల్లో ఎప్పుడూ లేనివిధంగా బూత్‌ల ముందు యువతరం బారులు
- పోటెత్తిన యువత ఓట్లతోనే పోలింగ్ శాతం పెరిగినట్టు అధికారుల అంచనా
- మంగళవారం తెల్లవారుజాము వరకు అనేకచోట్ల కొనసాగిన పోలింగ్
- అత్యధికంగా పిఠాపురం నియోజకవర్గంలో 86.63 శాతం నమోదు
- గత ఎన్నికలతో పోల్చితే పిఠాపురం నియోజకవర్గంలో 5.62 శాతం పెరుగుదల
- కాకినాడ సిటీలో అత్యల్పంగా 72.17శాతం మంది ఓటుహక్కు వినియోగం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఓటు చైతన్యం వెల్లువెత్తింది. ఓటుహక్కును ప్రజలు వజ్రాయుధంగా మల్చుకున్నారు. తమకున్న హక్కును అర్ధరాత్రి దాటినాసరే విసుగుచెందక బాధ్యతగా భావించారు. తిండి, నీరు లేకపోయినా క్యూలైన్ల నుంచి కదల్లేదు. ఇళ్లు.. ఊళ్లు.. ఏకమై పోలింగ్ బూత్‌లకు పోటెత్తాయి. దీంతో జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు మునుపెన్నడూ లేనంతంగా ఓ ఉద్యమంలా ప్రజలు కదిలారు. దీంతో మంగళవారం తెల్లవారుజామువరకు అనేక బూత్‌ల్లో పోలింగ్ జరిగింది. గతంలో ఎప్పుడూ లేనిరీతిలో ఓటర్లు అర్ధరాత్రి అయినా కదలకుండా మెదలకుండా ఓ తపస్సులా భావించి ఓటేశారు. ఫలితంగా జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌శాతం ఏకంగా 80.31 శాతం నమోదైంది. గత పదేళ్లలో ఈస్థాయి ఓటింగ్ జరడం ఇదే తొలిసారి. 2019 అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే ఏకంగా పోలింగ్ శాతం 1.79 శాతం పెరిగింది. పెరిగిన ఓటింగ్ శాతం అంతా యువతదేననే విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. ఎప్పుడూ లేనిది ఈ దఫా జిల్లాలో యువతరం ఉప్పెనలా బూత్‌ల్లో పోటెత్తారు. దీంతో అనూహ్య రీతిలో పోలింగ్‌శాతం పెరిగింది. అర్ధరాత్రి వరకు వందలాది బూత్‌ల్లో నిలబడిందీ యువతరమే. ఇక జిల్లాలో మొత్తం 16,34,122మంది ఓటర్లకుగాను ఏకంగా 13,12,297 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. అత్యధికంగా పిఠాపురం నియోజకవర్గంలో 86.63 శాతం పోలింగ్ జరగ్గా, గత ఎన్నికలతో పోల్చితే ఏకంగా 5.62శాతం పెరుగుదల నమోదైంది. కాకినాడసిటీలో అత్యల్పంగా 72.17 శాతం పోలింగ్ నమోదైంది. సోమవారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో ఓటర్లు పోలింగ్‌బూత్‌లకు అనుహ్యంగా పోటెత్తారు. పోలింగ్ ప్రక్రియ అర్ధరాత్రి అయినా పట్టువదలని విక్రమార్కుల్లా నిలబడ్డారు. కరెంట్ లేకపోయినా, బూత్‌లో అసలు విద్యుత్ వసతి లేకపోయినా, అటు ఓవక్క వర్షం, మరోపక్క సర్వర్ల మొరాయింపు, ఈవీఎంలు సరిగ్గా పనిచేయకపోయినా ఏమాత్రం తగ్గేదేలే అన్నట్టు వ్యవహరించారు. పోతేపోనీ నా ఒక్క ఓటే కదా అన్న ఆలోచనే లేకుండా ఓటుకోసం జాగారం సైతం చేశారు. ప్రధానంగా యువతరం ఈసారి జిల్లాలో ఓటుహక్కును సంపూర్ణంగా వినియోగించుకుంది. ఎన్నికల్లో ప్రచారాల్లో సందడి చేయడం మినహా ఓటేయరనే అపప్రదను యువత చెరిపేసింది. పట్టుదలగా ప్రతి ఒక్కరు ఈసారి ఓటువేశారు. దీంతో జిల్లాలో అనూహ్యంగా పోలింగ్‌శాతం పెరిగిపోయింది. సాధారణంగా అసెంబ్లీ ఎన్నికలు జరిగిన రాత్రికి మొత్తం పోలింగ్ శాతం వెల్లడవడం ఆనవాయితీ. కానీ ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ శాతం రావడానికి దాదాపు ఒకరోజు పట్టిందంటే ఏస్థాయిలో బూత్‌ల్లో జనం ఓటుతో పోటెత్తారో అర్థం చేసుకోవచ్చు. పోలింగ్ ముగిసిన తర్వాత జిల్లా కేంద్రంలోని స్ట్రాంగ్‌రూంలకు రాత్రి పది గంటలకు రావలసిన ఈవీఎంలు మంగళవారం ఉదయం పది వరకు వస్తూనే ఉన్నాయంటే ఏ స్థాయిలో కసిగా ఓటర్లు ఓటు వేశారో అర్థం చేసుకోవచ్చు.

ఏ నియోజవర్గంలో ఎలా అంటే...

జిల్లాలో మొత్తం 16,34,122 మంది ఓటర్లున్నారు. వీరిలో ఎన్నికల్లో ఏకంగా 13,12,297 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీంతో జిల్లాలో పోలింగ్‌శాతం 80.31గా నమోదైంది. వాస్తవానికి 2014 అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో పోలింగ్ శాతం 77.13 శాతంగా నమోదైంది. ఆ తర్వాత 2019 ఎన్నికల్లో జిల్లాలో పోలింగ్‌శాతం 78.52గా తేలింది. అంటే 1.39శాతం పెరిగింది. కానీ ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్‌శాతం 80.31గా తేలడంతో అప్పటికి ఇప్పటికి పోలింగ్‌శాతం 1.79శాతం పెరిగినట్టయింది. వాస్తవానికి పోలింగ్ శాతం ఈ స్థాయిలో పెరగడం వెనుక ఈసారి యువతరం ఓటుహక్కును భారీగా వినియోగించుకోవడమే కారణమని చెప్పాలి. ప్రధానంగా జిల్లాలో ఈసారి టీడీపీ, జనసేన కలిసిపోటీ చేశాయి. దీంతో యువతరం ఎక్కువగా బూత్‌లకు వచ్చి కూటమికి మద్దతుగా నిలిచాయి. అటు పవన్ జిల్లా నుంచే పోటీచేస్తుండడం, ఆయన పార్లమెంట్ అంతా సభలు, రోడ్డుషోలు నిర్వహించారు. చంద్రబాబు కూడా విస్తృతంగా తిరిగారు. దీంతో ప్రతి ఒక్కరు ఓటింగ్‌కు వచ్చి కూటమికి మద్దతుగా ఓటెత్తారు. అలాగే జిల్లాలో ఈ అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా ఓటర్లు సైతం భారీగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. జిల్లాలో 8,29,471 మంది మహిళా ఓటర్లకుగాను 6,59,596 మంది ఓటేశారు. పురుష ఓటర్లు 8,04,465కి 6,52,599మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అత్యధికంగా పిఠాపురం నియోజకవర్గంలో ఏకంగా 86.63 శాతం పోలింగ్ నమోదైంది. 2014 ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో పోలింగ్ 79.03%. 2019లో 81.01గా నమోదైంది. ఈసారి ఏకంగా 86.63%గా తేలింది. గత ఎన్నికలతో పోల్చితే ఈసారి ఏకంగా 5.62 శాతం అధికంగా నమోదైంది. ఈ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,36,409 మందికాగా ఏకంగా 2,04,811 మంది ఓటేశారు. జగ్గంపేటలో మొత్తం 2,29,863 మంది ఓటర్లుండగా, 1,92,287మంది ఓటేశారు. దీంతో ఇక్కడ పోలింగ్‌శాతం 83.65శాతంగా తేలింది. గత ఎన్నికల్లో 85.71 శాతంతో అత్యధిక పోలింగ్‌శాతం నమోదైన నియోజకవర్గంగా జగ్గంపేట రికార్డుకెక్కింది. కానీ ఈసారి 2.06 శాతం ఓటింగ్ తగ్గింది. తునిలో గత ఎన్నికల్లో 82.84శాతం ఓట్లు పోలవగా, ఈసారి ఎన్నికల్లో 83.38 శాతం నమోదైంది. పెద్దాపురం నియోజకవర్గంలో 82.29 శాతం ఓటింగ్ జరిగింది. నియోజకవర్గంలో మొత్తం 2,15,095 మందికిగాను 1,76,993 మంది హక్కు వినియోగించుకున్నారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడ పోలింగ్‌శాతం 81.37 శాతం. ప్రత్తిపాడు నియోజకవర్గంలో మొత్తం 2,17,267మందికిగాను 1,74,788మంది ఓట్లు వేశారు. పోలింగ్‌శాతం 80.45. 2019 ఎన్నికల్లో 80.99. కాకినాడ రూరల్ నియోజవర్గంలో ఈసారి 74.94శాతం పోలింగ్ జరిగింది. 2,69,330మందికి, 2,01,833 మంది ఓట్లేశారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడ పోలింగ్‌శాతం 74.07. కాకినాడసిటీలో మొత్తం 2,41,620మంది ఓటర్లకుగాను ఎన్నికల్లో 1,74,370మంది ఓట్లేశారు. దీంతో పోలింగ్‌శాతం అత్యల్పంగా 72.17శాతం నమోదైంది. గత ఎన్నికల్లో 66.77 శాతం పోలింగ్ జరగ్గా, ఈసారి 5.4శాతం ఓట్లుపెరిగాయి.



కాకినాడ రూరల్ మండలం సర్పవరంలో సోమవారం బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సరళి.. శాతాల్లో..

నియోజకవర్గం	2014	2019	2024
జగ్గంపేట	83.39	85.71	83.65
కాకినాడ సిటీ	67.05	66.77	72.17
కాకినాడ రూరల్	73.61	74.07	74.94
పెద్దాపురం	76.77	81.37	82.29
పిఠాపురం	79.03	81.01	86.63
ప్రత్తిపాడు	79.94	80.99	80.45
తుని	77.13	82.84	83.38
కాకినాడ జిల్లా	77.13	78.52	80.31

ఓటు పై అవగాహనతో గణనీయంగా ఓటింగ్ : జిల్లా కలెక్టర్ నివాస్

కలెక్టరేట్ (కాకినాడ), మే 14: కాకినాడ జిల్లాలో ఓటుపై అవగాహన సదస్సులు ఎక్కువగా నిర్వహించడం వల్ల ఓటింగ్ శాతం గణనీయంగా నమోదైందని జిల్లా కలెక్టర్ జె.నివాస్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాకినాడ జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజవర్గాలు కలిపి ఓటింగ్ శాతం 80.31 నమోదైందన్నారు. ప్రజాభాగస్వామ్యంతో జిల్లాలో విస్తృతంగా నిర్వహించిన స్వీప్ కార్యక్రమాలు ఇందుకు దోహదం చేశాయన్నారు. అర్హులైన వారందరూ ఓటర్లుగా నమోదు కావడంతోపాటు ఓటుహక్కు ప్రాధాన్యతను గుర్తించి బాధ్యతగా వినియోగించుకునేలా చైతన్య పరిచాయన్నారు. ఈ ఉద్యమంలో చురుకైన భూమిక వహించిన జేఎన్‌టీయూ, రంగారాయ వైద్య కళాశాలల విద్యార్థులు, లాయర్లు, మత్స్యకార పెద్దలు, ఆటో డ్రైవర్లు, పోలీసులు, స్వచ్ఛంద సంస్థలను ప్రత్యేకంగా అభినందించారు. అలాగే యువ నేపథ్య గాయకుడు యశస్వీ కొండేపూడి సహకారంతో చిత్రీకరించిన వీడియో గీతాలు ఎంతగానో దోహదపడ్డాయని కలెక్టర్ పేర్కొన్నారు.

జేఎన్‌టీయూకే విశ్వవిద్యాలయం పరిధిలో 144 సెక్షన్ అమలు

కలెక్టరేట్(కాకినాడ), మే 14 : కాకినాడ జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయం పరిధిలో మంగళవారం నుంచి 144 సెక్షన్ అమలు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ జె.నివాస్ తెలిపారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కాకినాడ జిల్లాలోని కాకినాడ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలైన ఈవీఎం, వీవీ ప్యాట్స్‌లను జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయంలో బ్లాకుల్లో సిద్ధం చేసిన స్ట్రాంగ్ రూముల్లో భద్రపరచడం జరిగిందన్నారు. కేంద్ర, రాష్ట్ర పోలీస్ బలగాలతో మూడంచెల భద్రతను స్ట్రాంగ్ రూముల వద్ద ఏర్పాటుచేశామన్నారు. మంగళవారం నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసేంతవరకు జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయం చుట్టూ ఒక కిలోమీటరు పరిధిలో 144 సెక్షన్ పటిష్టంగా అమలుచేయడం జరుగుతుందన్నారు.



ఉడిమూడి రహదారిపై గ్రామస్తుల ధర్నా

దూసుకొచ్చిన మృత్యువు

- ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్
- నలుగురు అక్కడికక్కడే మృతి
- మరో ఆరుగురికి తీవ్రగాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం
- ధాన్యం లోడ్ చేస్తుండగా ఘటన
- ఉడిమూడి వద్ద ప్రమాదం
- రెండు గ్రామాల్లో తీవ్ర విషాదం
- న్యాయం చేయాలని ధర్నా

పి.గన్నవరం/అంబాజీపేట/రావులపాలెం, మే 14 : ఉదయం నుంచి ఆనందంగా పనిచేస్తున్నారు.. కాసేపట్లో పనిముగించుకుని ఇళ్లకు వెళ్లిపోదామని చీకట్లోనే పని చేస్తున్నారు. ఆర్టీసీ బస్సు రూపంలో మృత్యువు దూసుకొచ్చింది.. నలుగురు కూలి బతుకులను కూల్చివేసింది.. రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబాలు చిన్నాభిన్నమయ్యాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం ఊడిమూడి శివారు చింతావారిపేట వద్ద 10 మంది కూలీలు ట్రాక్టర్‌పై ధాన్యం లోడు చేస్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో నలుగురు అక్కడికక్కడే మృతిచెందారు. జట్టు కూలీలతో పాటు బస్సులో ప్రయాణిస్తున్న పలువురికి గాయాలయ్యాయి. పి.గన్నవరం మండలం ఆదిమూలవారిపాలెంలో ఒకే కుటుంబానికి చెందిన చిలకలపూడి మణిబాబు (31), చిలకలపూడి సురేష్, గంటి పెదపూడి గ్రామానికి చెందిన నూకపెయ్యి శివ (32), వాసంశెట్టి సూర్యప్రకాష్ (48), ఈరి కట్టయ్య (46)లతో పాటు మరో ఆరుగురు కలిసి మంగళవారం తెల్లవారుజామున ధాన్యం లోడు చేసేందుకు చింతావారిపేట వచ్చారు.ఉదయం నుంచీ ధాన్యం పట్టుబడులు పట్టి రాత్రి 7 గంటల సమయంలో ప్రధాన రహదారి చెంతనే ట్రాక్టర్ ధాన్యం బస్తాలను లోడ్ చేసి పగ్గం బిగిస్తున్నారు.ఈ సమయంలో రాజోలు నుంచి రాజమహేంద్రవరం వైపు వేగంగా వెళ్తున్న ఆర్టీసీ బస్సు ట్రాక్టరును బలంగా ఢీకొని జట్టు కూలీలపై నుంచి దూసుకుపోయింది.నలుగురు అక్కడిక్కడే మృతి చెందగా బస్సు సుమారు 10 మీటర్ల మేర ఈడ్చుకుపోవడంతో మృతదేహాలు గుర్తుపట్టలేని స్థితిలో రహదారిపై చిందవందరగా పడ్డాయి. దీంతో భయానక వాతావరణం ఏర్పడింది. మృతదేహాల వద్ద కుటుంబీకులు రోధిస్తున్న తీరు ప్రయాణికులను సైతం కలిచివేసింది. ఒక మృతదేహం నుజ్జునుజ్జుకావడంతో మూటకట్టారు.ఇద్దరికి తీవ్ర గాయాలు నలుగురు సురక్షితంగా బయటపడ్డారు. జట్టు కూలీలు చిలకలపూడి సురేష్, బొరుసు నానిలకు తీవ్ర గాయాలయ్యాయి. సురేష్‌ను తొలుత పి.గన్నవరం సీహెచ్‌సీకి తరలించగా పరిస్థితి విషమించడంతో అమలాపురం ఆసుపత్రికి తరలించారు. నానితో పాటు గాయాలపాలైన ప్రయాణికులను కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. పి.గన్నవరం నుంచి ఈతకోట వెళ్లే రహదారిలో ప్రయాణం ప్రమాదభరితమే. ప్రధాన పంట కాలువకు రక్షణగోడ లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయని స్థానికులు చెప్పారు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో కనీసం వీధిలైట్లు కూడా లేవు. సెల్ ఫోన్ల లైట్ల వెలుగులో పోలీసులు మృతదేహాలను గుర్తించి వివరాలు నమోదు చేయాల్సి వచ్చింది. అందరితో కలుపుగోలుగా ఉండే వారు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం కలచివేసింది. పి.గన్నవరం మండలం గంటి పెదపూడికి చెందిన నూకపెయ్యి శివ, వాసంశెట్టి సూర్యప్రకాష్,ఈరి కట్టయ్య, ఆదిమూలవారిపాలేనికి చెందిన చిలకలపూడి మణిబాబు మృతితో ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుల కుటుంబీకులు రోధిస్తున్న తీరు అందరినీ కలచివేసింది. తమకు న్యాయం చేయాలంటూ మృతదేహాలతో మృతుల కుటుంబీకులు, స్థానికులు ధర్నాకు దిగారు.ఒక్కొక్కరికీ రూ.10లక్షలు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సంఘటనా స్థలానికి కలెక్టర్, ఎస్పీ, ఆర్డీవో రావాలని నినాదాలు చేశారు.న్యాయం చేసే వరకు మృతదేహాలను తరలించ మంటూ భీష్మించారు.ఆర్‌డీవో వచ్చి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. పోలీసులు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా వాహనాలను దారి మళ్లించారు. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్ పరారయ్యాడు. ప్రమాద స్థలికి కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ,సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్ఐ బి.శివకృష్ణ చేరు కుని మృతుల వివరాలు సేకరించారు.ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు డ్రైవరు సంఘటనాస్థలానికి రావాలంటూ పోలీసులతో వాగ్వివాదానికి దిగారు.మృతదేహాలను జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, కూటమి శ్రేణులు పరిశీలించారు.రోడ్డు ప్రమాద మృతుల కుటుం బీకులు ఒక్కొక్కరికీ రూ.లక్ష వంతున సాయం అందిస్తానని పి.గన్నవరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ ప్రకటించారు. కూటమి శ్రేణులు శిరిగినీడి వెంకటేశ్వరరావు,సంసాని పెద్దిరాజు, వాసంశెట్టి కుమార్, తాటికాయల శ్రీనివాసరావు, రుద్రరాజు వీరభద్రరాజు, అరిగెల సూరిబాబుతో పాటు పలువురు ప్రమాద స్థలికి చేరుకుని మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు.



మృతుల కుటుంబీకుల రోదన



మణిబాబు కట్టయ్య సూర్యప్రకాష్

తిరిగి వెళ్లేందుకు అవస్థలు

సరిపడా బస్సులు ఏర్పాటు చేయని ఆర్టీసీ.. రైళ్లు ఫుల్.. ప్రైవేటు బస్సులు చార్జీల బాదుడు.. ఓటర్ల అగచాట్లు

పిఠాపురం,మే14: ఓటు వేసేందుకు ఉత్సాహంగా స్వస్థలాలకు తరలివచ్చిన ఓటర్లకు తిరిగి వెళ్లేందుకు చుక్కలు కనిపిస్తున్నాయి. రైళ్లలో రిజర్వేషన్లు అన్నీ ఫుల్ అయ్యాయి. ఆర్టీసీ సరిపడా బస్సులు ఏర్పాటుచేయడంలో విఫలమైంది. ప్రైవేటు బస్సుల్లో చార్జీలు ఏకంగా 200శాతంపైగా పెరిగాయి. విమాన చార్జీల్లో ఆకాశమే హద్దుగా పెరుగుదల కనిపిస్తోంది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఓటువేసేందుకు గతంలో ఎన్నడూలేనివిధంగా భారీగా ఓటర్లు తమ స్వస్థలాలకు తరలివచ్చారు. హైదరాబాద్‌తోపాటు బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, ముంబై, కోల్‌కత్తా, పూణే తదితర నగరాలతోపాటు పలు రాష్ట్రాల్లో వృత్తి, వ్యాపారాలు, ఉద్యోగాలరీత్యా ఉంటున్న వారంతా ఓటు వేయాలనే ఉత్సాహంగా భారీగా పోటెత్తారు. సోమవారం పోలింగ్ కావడం, శని, ఆదివారాలు సెలవులురావడంతో ఓటు వేయడంతోపాటు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో గడిపే అవకాశం ఉంటుందనే భావనతో జిల్లాకు వచ్చారు. ఒక్క కాకినాడ జిల్లాకే సుమారు లక్షమంది ఓటుహక్కు వినియోగించుకునేందుకు తరలివచ్చినట్టు అంచనా. అయితే ఆనందంగా కుటుంబ సభ్యులతో గడిపి తిరిగి వెళ్లదామనుకున్న వారికి షాక్ తగిలింది. రైళ్లల్లో రిజర్వేషన్లన్నీ ఫుల్ అయ్యాయి. బస్సులు, విమాన చార్జీలు ఆకాశమే హద్దుగా పెరిగిపోయాయి.

ఏ ట్రైన్ ఖాళీ లేదు

కాకినాడ జిల్లాలోని తుని, అన్నవరం, పిఠాపురం, కాకినాడ, సామర్లకోట తదితర ప్రాంతాల నుంచి హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వెళ్లే రైళ్లలో రిజర్వేషన్‌లు పూర్తికావడంతోపాటు రిగ్రెట్ వస్తోంది. మంగళవారంతోపాటు బుధ, గురువారాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. గౌతమి, గోదావరి, విశాఖ, ఏసీ స్పెషల్, నాంథేడ్ స్పెషల్, కోణార్క్, జన్మభూమి, ఎల్‌టీటీ, వందేభారత్, గరీబ్‌రథ్, ఫలక్‌నామా సహా అన్ని రైళ్లలో ఇదే పరిస్థితి. రైల్వేశాఖ పలు స్పెషల్స్ రన్ చేస్తున్నా రిజర్వేషన్ దొరకని స్థితి నెలకొంది.

ఆర్టీసీదీ అదే దారి

ఆర్టీసీ బస్సులన్నీ తిరిగి వెళ్లేవారితో నిండుగా ప్రయాణిస్తున్నాయి. స్వస్థలాలకు వచ్చేవారి కోసం ప్రత్యేక బస్సులు నడిపిన ఆర్టీసీవారు తిరిగి హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు సరిపడా బస్సులు నడపడంలో విఫలమైంది. దీంతో ప్రైవేటు బస్సులపై ఆధారపడాల్సి వచ్చింది. దీనివల్ల బస్సు చార్జీలను పెంచేశారు. సాధారణంగా వెయ్యి రూపాయలు ఉండే హైదరాబాద్ చార్జీ ఇప్పుడు రూ.2 వేల నుంచి రూ.3,500 వరకూ ఉంది. అయినా కూడా టిక్కెట్లు దొరకక ఇబ్బందులు పడుతున్నారు.



ఆకాశంలో విమాన చార్జీలు

విమానచార్జీలు ఆకాశమే హద్దుగా పెరిగిపోయాయి. రాజమహేంద్రవరం నుంచి హైదరాబాద్‌కు సాధారణ రోజుల్లో విమాన చార్జీ గరిష్ఠంగా రూ.3,500 ఉంటుంది. మంగళవారం టిక్కెట్టు ధర రూ.14,500కు చేరుకుంది. బుధవారం కూడా టిక్కెట్టు ధర రూ.8 వేల నుంచి రూ.11వేల మధ్యలో ఉంది. అటు బస్సులు, రైళ్లు దొరకక, ఇటు విమానచార్జీలు, ప్రైవేటు బస్సు చార్జీలు పెరిగిపోవడంతో కొందరు తమ ప్రయాణాలను వాయిదా వేసుకోగా, కొందరు తప్పని పరిస్థితుల్లో అధిక రేట్లకు కొని వెళుతున్నారు.

జేఎన్‌టీయూకే స్ట్రాంగ్ రూంలో ఈవీఎంలు భద్రం



కాకినాడలోని జేఎన్‌టీయూ స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపర్చిన ఈవీఎంలు, వీవీప్యాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ నివాస్

కలెక్టరేట్(కాకినాడ), మే14: కాకినాడ పార్లమెంట్‌తోపాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలు, వీవీప్యాట్లను జేఎన్‌టీయూ కాకినాడ స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చారు. జిల్లా కలెక్టర్, ఆర్వోలు, ఎన్నికల్లో బరిలో నిలిచిన అభ్యర్థుల సమక్షంలో వీటికి సీల్ వేశారు. స్ట్రాంగ్‌రూమ్ లోపల, స్ట్రాంగ్‌రూమ్ బయట సీసీ కెమెరాలను ఏర్పాటుచేశారు. కౌంటింగ్ హాల్‌లో ఏర్పాటుచేసిన టీవీలకు సీసీ కెమెరాలను అనుసంధానించారు. తద్వారా 24 గంటలపాటు అధికారులు పర్యవేక్షిస్తున్నారు. స్ట్రాంగ్‌రూమ్‌లోకి ఎవ్వరూ ప్రవేశించకుండా పోలీసుతోపాటు సీఆర్‌పీఎఫ్ బలగాలను మోహరించారు. మంగళవారం జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎస్.గణేశ్, రాజేశ్‌జోగ్‌పాల్, జిల్లా కలెక్టర్ జె.నివాస్, ఎస్పీ సతీష్‌కుమార్, జేసీ రామ్‌సుందర్‌రెడ్డిల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లకు సీల్ వేశారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ నివాస్ మాట్లాడుతూ పోలింగ్ రాత్రి వరకు కొనసాగడం వల్ల ఈవీఎంలు భద్రపర్చే ప్రక్రియ కొంత ఆలస్యమైందన్నారు. జేఎన్‌టీయూకే సివిల్ ఇంజినీరింగ్ పీజీ బ్లాక్‌లో తుని, కాకినాడ సిటీ నియోజకవర్గాల ఈవీఎంలను భద్రపర్చామన్నారు. అలాగే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీలో ప్రత్తిపాడు, పిఠాపురం, జగ్గంపేట ఈవీఎంలను భద్రపర్చామన్నారు. మెకానికల్ ఇంజినీరింగ్ బ్లాక్‌లో కాకినాడ రూరల్ ఈవీఎంలను, మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియంలో పెద్దాపురం నియోజకవర్గం ఈవీఎంలను ఉంచామన్నారు. అన్ని స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మెట్లు, వరండా, రూమ్ అన్ని వైపుల కనిపించే విధంగా సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ చెప్పారు.

పిఠాపురం ఓటు వైపో?



86.63%

ఓట్ల శాతం



తీరం దాటింది



యువ ఓటర్ల ఉత్సాహం

పిఠాపురం నియోజకవర్గంలో ఓ పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన కొత్త ఓటర్లు



పిఠాపురం, మే 14: పిఠాపురంలో రికార్డుస్థాయి పోలింగ్ నమోదయింది. అసెంబ్లీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 86.63 శాతం నమోదైన ఈ ఓటింగ్ ఎవరికి వరంగా మారుతుందో అన్న చర్చ జోరుగా సాగుతోంది. వార్ వన్‌సైడ్ అవ్వడం వలనే ఇంత ఓటింగ్ జరిగిందని జనసేన వర్గాలు చెబుతున్నాయి. ఓటింగ్‌లో యువ, మహిళా ఓటర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో భారీ పోలింగ్ నమోదైంది. ఉదయం నుంచి ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరి రాత్రి 11గంటల వరకూ ఓటు హక్కు వినియోగించుకోవడం ఇందుకు అద్దం పట్టింది. ఎండ తీవ్రతను లెక్కచేయకుండా యువతీ యువకులు, మహిళలు, వృద్ధులు భారీగా పోలింగ్ కేంద్రాలకు తరలిరావడంపై ఓటింగ్‌పై ప్రభావం చూపించింది.

పిఠాపురం నియోజకవర్గంలో ఓట్ల ప్రవాహం

నియోజకవర్గం చరిత్రలోనే తొలిసారి అత్యధిక శాతం నమోదు

నియోజకవర్గంలో 2,36,409 మంది ఓటర్లు ఉండగా, ఇందులో పురుషులు 1,18,183 ఉండగా మహిళలు 1,18,223 మంది, ట్రాన్స్‌జెండర్లు ముగ్గురు ఉన్నారు. ఇందులో 2,04,811 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోగా, ఇందులో 1,03,370 మంది పురుషులు, 1,01,438 మంది మహిళలు, ముగ్గురు ట్రాన్స్‌జెండర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ శాతం 86.63గా నమోదయింది. 2019 అసెంబ్లీ ఎన్నికల కంటే ఇది 5.62 శాతం అధికం. ఆ ఎన్నికల్లో 81.01 శాతం మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. 1,71,234 మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకోగా పురుషులు 83,441 మంది ఉండగా, మహిళలు 87,791 మంది ఉన్నారు. 2014లో 79.44 శాతం మంది ఓటర్లు మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు.

పెరిగిన ఓటు దేనికి సంకేతం?

అసెంబ్లీ ఏర్పడిన తర్వాత ఇదే అత్యధిక ఓటింగ్ శాతం. రికార్డుస్థాయి పోలింగ్ నమోదు కావడంతో పెరిగిన ఓటింగ్ దేనికి సంకేతమనే చర్చ జోరుగా సాగుతోంది. యువ ఓటర్లు అత్యధికంగా ఓటింగ్‌కు తరలిరావడం ఇందుకు కారణంగా చెబుతున్నారు. పిఠాపురం నుంచి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పోటీ చేయడం, ప్రభుత్వంపై వ్యతిరేకత తదితర కారణాలతో యువత ఓటింగ్‌కు వచ్చేందుకు ఉత్సాహం చూపించారు. అదే విధంగా ఇతర ప్రాంతాల్లో వృత్తి, వ్యాపార, ఉద్యోగాల రీత్యా ఉంటున్న వారు ఓటింగ్‌కు తరలివచ్చారు. ఒక్క పిఠాపురం నియోజకవర్గంలోనే స్థానికంగా ఉంటున్నవారు కాకుండా హైదరాబాదు, బెంగళూరు, చెన్నై నగరాలతో పాటు ఉభయ తెలుగురాష్ట్రాలు, కర్నాటక, ఒడిసా, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర తదితర ప్రాంతాలు నుంచి సుమారు 16-17వేల మంది వచ్చారు. వీరితో పాటు విదేశాల్లో ఉంటున్న మరో 500-600 మంది ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చారు. స్థానికంగా ఉండే ఓటర్లతో పాటు ఇతర ప్రాంతాల్లో నివాసముంటున్న నియోజకవర్గ ఓటర్లు తరలిరావడమే కారణంగా భావిస్తున్నారు.

గతంలో ఎన్నడూ లేని విధంగా పోలింగ్ కేంద్రాల వద్ద భారీగా ఓటర్లు బారులు తీరి ఉండటంతో ఓటింగ్ ఆలస్యమైంది. నియోజకవర్గంలోని పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతో పాటు విరవ, విరవాడ, చిత్రాడ,

రాత్రి 11 గంటల వరకు..

దుర్గాడ, చేబ్రోలు, తాటిపర్తి తదితర గ్రామాల్లో సాయంత్రం 6 గంటల సమయానికి ఈ ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద ప్రతి చోటా 100 నుంచి 200 మంది వరకూ ఓటర్లు క్యూలో ఉన్నారు. కత్తులగూడెం పోలింగ్ కేంద్రం వద్ద పోలింగ్ పూర్తయ్యే సరికి రాత్రి 11 గంటలు దాటింది. ఇక్కడ క్యూలో దాదాపు 300 మంది ఓటర్లు ఉండిపోయారు.



పిఠాపురం కత్తుల గూడెంలో రాత్రి 10గంటలకు కూడా క్యూలోనే ఓటర్లు

పవన్‌పై ప్రేమ అంటున్న జనసేన శ్రేణులు

జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌పై పిఠాపురం నియోజకవర్గ ప్రజలు చూపించి ప్రేమ, ఆదరాభిమానాలకు ఈ ఓటింగ్ నిదర్శనమని జనసేన వర్గాలు చెబుతున్నాయి. అందుకే రికార్డుస్థాయి ఓటింగ్ నమోదైందని, ఇది వార్ వన్‌సైడ్ అయిందనేందుకు నిదర్శనమని వారు పేర్కొంటున్నారు. పవన్‌కు ఓటు వేసేందుకు నియోజకవర్గంలో ఓటర్లు ఉండి దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్నవారంతా ఇక్కడకు తరలివచ్చారని వారు తెలిపారు. ఓటింగ్ మాదిరిగానే మెజార్టీ కూడా ఉంటుందని వారు ధీమా వ్యక్తం చేశారు. పెరిగిన ఓటింగ్ వైసీపీలో కలవరాన్ని సృష్టిస్తున్నది. నేతలు ఎవ్వరు నోరు మెదిపేందుకు ఆసక్తి చూపడం లేదు.

పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధే ముఖ్యం

పవన్ బాధ్యతాయుతమైన వ్యవస్థను ఏర్పాటు చేస్తారు

కాశీ తువ్వాలుపై కూడా వైసీపీ కుట్రలు

జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు



సమావేశంలో మాట్లాడుతున్న నాగబాబు

పిఠాపురం, మే 14: 'పిఠాపురం నుంచి పోటీ చేసిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు ఎంత మెజార్టీ ఇస్తారనేది ప్రజల నిర్ణయం. మాకు మాత్రం ప్రజలకు ఏమి చేస్తాం. ఎంత అభివృద్ధి చేస్తామనేదే ముఖ్యం' అని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కెనాగబాబు తెలిపారు. పిఠాపురం మండలం కుమారపురంలోని గోకులం గ్రాండ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధి కోసం పవన్‌కల్యాణ్ బాధ్యతాయుతమైన వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. శ్రామికులు స్వేదం తుడుచుకోవడానికి వాడే కాశీ తువ్వాలుపై కూడా వైసీపీ చేసిన కుట్రలు విఫలమయ్యాయని చెప్పారు. పవన్ జనసేన అధ్యక్షుడి హోదాలో రాష్ట్రవ్యాప్తంగా జనసేనతో పాటు కూటమి తరపున ప్రచారం నిర్వహించారని తెలిపారు. పిఠాపురానికి పూర్తిస్థాయిలో సమయం కేటాయించలేని పరిస్థితుల్లో కమిటీలను ఏర్పాటు చేశారని, కమిటీ సభ్యులందరూ బాధ్యతతో ప్రచారం నిర్వహించి అన్ని విధాల సహకరించారని చెప్పారు. జనసైనికులు, వీరమహిళలు అహర్నిశలు శ్రమించారని తెలిపారు. పవన్ కోసం రాష్ట్రం నుంచే గాక తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, ఒడిసా తదితర రాష్ట్రాలు నుంచి ఎంతో మంది స్వచ్ఛందంగా వచ్చి ప్రచారం నిర్వహించారన్నారు. పవన్‌ను నిలబెట్టుకోవడానికి, గెలిపించుకునేందుకు పిఠాపురం ప్రజలు పరితపించిన తీరు తమకు సంతోషాన్ని ఇచ్చిందని చెప్పారు. వైసీపీ దుర్మార్గ పాలనను తరిమికొట్టేందుకు ప్రజలంతా రాష్ట్ర వ్యాప్తంగా బయటకు వచ్చి ఓటు వేశారని తెలిపారు. పవన్ గెలుపు కోసం నిరంతరం శ్రమించిన నియోజకవర్గ జనసేన. తెలుగుదేశం, బీజేపీ నాయకులు, కార్యకర్తలకు, స్నేహితులు, మిత్రులు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మకు నాగబాబు కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో జనసేన పిఠాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాసరావు, జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయకుమార్, మహేంద్రరెడ్డి, శంకరగౌడ్, గంటా స్వరూప, కడలి ఈశ్వరి, కడారి తమ్మయ్యనాయుడు, పిల్లా శివశంకర్, పిల్లా రమ్యజ్యోతి, తెలగంశెట్టి వెంకటేశ్వరరావు, బీఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

నంది వాహనంపై వీరేశ్వరస్వామి



ఐ.పోలవరం, మే 14: మురమళ్ల శ్రీభద్రకాళీవీరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం స్వామి, అమ్మవార్లను నంది వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. నాలుగో రోజు కార్యక్రమాల్లో భాగంగా ఉదయం విశేష అభిషేకం, చండీ హోమం, కళా హోమాలు, సాయంత్రం నంది వాహనంపై ఊరేగింపు, సదస్యం, సభాపూజ, పండిత సత్కారం తదితర పూజాకార్యక్రమాలు నిర్వహించారు. యనమంద్ర సత్యసీతారామశర్మ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో వివిధ ప్రాంతాల వేద పండితులు పాల్గొన్నారు. ఆలయ ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆత్రేయపురంలో ఉద్రిక్తత

ఇరు రాజకీయ పార్టీల మధ్య ఘర్షణ

మోహరించిన పోలీసులు

వైసీపీ నేత సోషల్ మీడియాలో సవాల్ పోస్టు

వైసీపీ ఘర్షణలో గాయపడిన టీడీపీ కార్యకర్త

ఎస్ఐ చెవికి గాయం

ఆత్రేయపురం, మే 14: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో మంగళవారం ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జరిగిన ఘర్షణ చిలికిచిలికి గాలివానై ఉద్రిక్తతకు దారితీసింది. సోమవారం ఆత్రేయపురంలోని నెం.27 పోలింగ్ కేంద్రంలోకి వైసీపీ నేతలు వెళ్లడంతో అక్కడే ఉన్న టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు (గబ్బర్‌సింగ్) అభ్యంతరం వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న వైసీపీ శ్రేణులు వెంకట్రాజుపై దాడికి పాల్పడ్డారు. ఆయన చొక్కా చిరిగి భుజానికి గాయమైంది. గొడవ సద్దుమణిగిందన్న తరుణంలో ఆత్రేయపురానికి చెందిన వైసీపీ నేత వేగేశ్న గోపిరాజు టీడీపీ నేతలకు సవాల్ విసురుతూ సోమవారం రాత్రి సోషల్ మీడియాలో పెట్టిన పోస్టింగ్ కలకలం సృష్టించింది. వైసీపీ నేతల అరాచకాలతో విసిగి వేసారిన టీడీపీ శ్రేణులు మంగళవారం ఉదయం రావిచెట్టు సెంటరు వద్దకు వెళ్లారు. అదే సమయంలో వైసీపీ శ్రేణులు కూడా వచ్చాయి. అక్కడ ఇరు వర్గాల వారు కలబడగా కొందరు స్వల్పంగా గాయపడ్డారు. టీడీపీ కార్యకర్త ముదునూరి రామభద్రరాజును గాయపరిచారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇరువర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకువస్తున్న తరుణంలో ఎస్ఐ చెవికి గాయమైంది. పోలీసు ఉన్నతాధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి స్టేషన్ వద్దకు చేరుకుని పరిస్థితికి కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరోపక్క టీడీపీ శ్రేణులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ ఆ పార్టీ కార్యకర్తలు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి ఆకుల రామకృష్ణ, సలాది రామకృష్ణ, కప్పల సునీల్, చిలువూరి సతీష్‌రాజు, కరుటూరి నరసింహారావు జరిగిన అన్యాయంపై పోలీసులను నిలదీశారు. సీఐ, ఎస్ఐలు అధికార పార్టీకి కొమ్ముకాస్తున్నారని డీఎస్పీ కేవీ రమణపై మండిపడ్డారు. అనంతరం డీఎస్పీ టీడీపీ నాయకులతో మాట్లాడి సమస్యను సామరస్యంగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. విషయం తెలుసుకున్న కొత్తపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు హుటాహుటిన ముదునూరి వెంకట్రాజు స్వగృహానికి చేరుకున్నారు. నాయకులతో సమావేశమై అధికార పార్టీ నాయకుల దౌర్జన్యాలపై చర్చించారు. రాష్ట్రంలోను, కొత్తపేట నియోజకవర్గంలోను ప్రజలు చారిత్రాత్మక తీర్పు ఇచ్చారని, అది ఓర్వలేకే కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి టీడీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు ఉసిగొల్పడం సిగ్గుచేటన్నారు. అనంతరం టీడీపీ శ్రేణుల తరపున లీగల్ సెల్ బృందం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇరువర్గాల నుంచి వచ్చిన ఫిర్యాదులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు డీఎస్పీ తెలిపారు. ప్రస్తుతం ఆత్రేయపురంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. రిజర్వ్ పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.



మోహరించిన పోలీసులు



గాయపడ్డ టీడీపీ కార్యకర్త

అమెరికా నుంచి ఓటేయడానికి వచ్చా..



అమలాపురం టౌన్, మే 14: రాకుర్తి వెంకటేష్ అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీలోని జార్జ్ ఎంసన్ యూనివర్సిటీలో మాస్టర్ ఇన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చదువుతున్నాడు. ఈసారి జరిగిన సార్వత్రిక ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తును నిర్దేశించేవని ప్రగాఢంగా నమ్మిన అతను అమెరికా నుంచి ఓటేయడానికి వచ్చాడు. అమలాపురంలో ఓటే వేశాడు. ఈ సందర్భంగా అతను మాట్లాడుతూ అప్పులపాలైన రాష్ట్రాన్ని గాడిలో పెట్టడంతో పాటు రాష్టానికి రాజధాని నిర్మించి, పరిశ్రమలు తీసుకువచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్న భావనతోనే సెలవు పెట్టి మరీ అమెరికా నుంచి వచ్చి ఓటేశానని చెప్పారు.

సత్యదేవుడి సేవకు ఛత్రముల బహూకరణ



ఛత్రములు బహూకరిస్తున్న దృశ్యం

అన్నవరం, మే 14: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సేవకు ఉపయోగించే ఛత్రములను మంగళవారం ఒకదాత విరాళంగా సమర్పించారు. గుడివాడకు చెందిన అమ్మా కనస్ట్రక్షన్ అధినేత మాటూరి రంగనాథ్ వీటిని దేవస్థానం పీఆర్వో కృష్ణారావుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతను పీఆర్వో అభినందించి వారికి స్వామివారి ప్రత్యేక దర్శనం, ప్రసాదాలు అందజేశారు. ఈనెల 18 నుంచి ప్రారంభంకానున్న స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలలో వినియోగించి నిరంతరం స్వామివారి సేవలకు ఉపయోగిస్తామని పీఆర్వో తెలిపారు.

కూటమి నేతలపై వైసీపీ శ్రేణుల దాడులు

వల్లూరులో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు

జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ లీలాకృష్ణ అరెస్ట్

రామచంద్రపురం కోర్టుకు హాజరు..విడుదల

కపిలేశ్వరపురం, మే 14: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం వల్లూరులో పోలింగ్ నేపథ్యంలో స్థానిక పోలింగ్ కేంద్రం వద్ద సోమవారం రాత్రి ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామానికి చెందిన వైసీపీ, కూటమి నేతల మధ్య పరస్పర దాడులు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో మండపేట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణపై వైసీపీ వర్గీయులు తప్పుడు హత్యాయత్నం కేసు బనాయించారనే ఆరోపణలు పరిస్థితిని మరింత వేడెక్కించాయి. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. వల్లూరులో సోమవారం రాత్రి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తడంతో రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ, మండపేట రూరల్ సీఐ శ్రీధర్‌కుమార్, అంగర ఎస్ఐ ఎ.పరదేశి అక్కడకు చేరుకుని నాయకులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అప్పటికే అక్కడకు చేరుకున్న వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులు, ఆయన తనయుడు పృథ్వీరాజ్ వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లు రువ్వడంతో దెబ్బతింది. దీంతో అదే గ్రామానికి చెందిన ఒకరిపై మండపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ వేగుళ్ల లీలాకృష్ణ దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడినట్లు వైసీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కూటమి నేతలపై వైసీపీ నేతలు దాడి చేసి అక్రమ కేసులు బనాయించడంతో లీలాకృష్ణను వల్లూరులో ఆయన స్వగృహంలో మంగళవారం తెల్లవారుజామున పోలీసులు అక్రమ అరెస్ట్ చేసి భారీ బందోబస్తు నడుమ ఆయనను కె.గంగవరం మండలం పామర్రు పోలీస్ స్టేషన్‌కు అక్కడ నుంచి మండపేట సీఐ కార్యాలయానికి తరలించారు. విషయం తెలుసుకున్న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు, పార్టీ శ్రేణులు అక్కడకు చేరుకున్నాయి. అక్కడ నుంచి ఆలమూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చి వైద్య పరీక్షల అనంతరం ఆయనను మండపేట సీఐ కార్యాలయానికి తరలించారు. అక్కడ నుంచి ఆయనను రామచంద్రపురం కోర్టులో జడ్జి ముందు హాజరుపర్చగా వాదనలు విన్న అనంతరం జడ్జి లీలాకృష్ణకు బెయిల్ మంజూరు చేయగా ఆయన బెయిల్‌పై బయటకు వచ్చారు. అనంతరం లీలాకృష్ణ మాట్లాడుతూ తనను అన్యాయంగా కేసులో ఇరికించి కుట్ర రాజకీయాలు చేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఆయన వెంట రామచంద్రపురం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వాసంశెట్టి సుభాష్, మండపేట మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు వరప్రకాష్ ఉన్నారు. గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్నారు.



రామచంద్రపురం కోర్టు నుంచి విడుదలైన లీలాకృష్ణ

తప్పుడు కేసులు బనాయించారు

రామచంద్రపురం, మే 14: తనపై పోలీసు అధికారుల సహకారంతో హత్యాయత్నం కేసులు బనాయించారని మండపేట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ ఆరోపించారు. మంగళవారం రామచంద్రపురం కోర్టు నుంచి బెయిల్‌పై విడుదల అయిన అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు వల్లూరులో ఉద్దేశపూర్వకంగానే గొడవ పెట్టుకున్నారని ఆరోపించారు. పోలీసు అధికారుల సహకారంతో తమపై కేసు పెట్టారన్నారు. కోర్టులో వాస్తవాలు వివరించడంతో బెయిల్ మంజూరయ్యిందన్నారు. డీఎస్పీ, సీఐల సహకారంతోనే తప్పుడు కేసులు నమోదు చేశారని ఆరోపించారు.

లీలాకృష్ణ అరెస్టు అమానుషం

జనసేనాని పవన్‌కల్యాణ్ ఖండన

మండపేట, మే 14: జనసేన పార్టీ మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణను పోలీసులు అరెస్టు చేయడాన్ని జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఖండించారు. ఈమేరకు జనసేన కేంద్ర కార్యాలయం నుంచి పవన్‌కల్యాణ్ పేరిట లేఖను విడుదల చేశారు. వైసీపీకి చెందిన వారు జనసేన వారిపై కవ్వింపు చర్యలకు పాల్పడిన నేపథ్యంలో లీలాకృష్ణపై హత్యాయత్నం కేసు నమోదు చేయడంలో రాజకీయ కుట్ర దాగి ఉందని పవన్ పేర్కొన్నారు. వైసీపీ అభ్యర్థి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుపై, అతడి అనుచరులపై కేసు నమోదు చేయకపోవటాన్ని పవన్ తప్పు పట్టారు. లీలాకృష్ణ అరెస్టు అన్యాయమని పవన్ అన్నారు. లీలాకృష్ణకు జనసైనికులు, పార్టీ అండగా ఉంటుందన్నారు.

చెట్టును ఢీకొన్న కారు

మహిళ మృతి..మరో ఇద్దరికి గాయాలు



చింతూరు, మే 14 : అదుపు తప్పిన కారు చెట్టుకు ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న మహిళ మృతి చెందారు. కృష్ణా జిల్లా గంపలగూడెంకు చెందిన ఒక కుటుంబం అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి వచ్చారు. అనంతరం మంగళవారం తిరిగి వారి ప్రాంతానికి వెళ్లేందుకు కారులో బయలుదేరారు. ఈ క్రమంలో చింతూరు మండలం, కాటుకపల్లి సమీపంలో అదుపుతప్పిన కారు రహదారిని ఆనుకొని ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న లక్ష్మి (46) అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ప్రయాణిస్తున్న మరో ఇద్దరు మహిళలకు, కారు డ్రైవర్‌కు, ఒక బాలుడికి కూడా గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని ఏడుగురాళ్లపల్లి ప్రాథమిక వైద్యశాలకు తరలించారు. చింతూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యర్థులపై కత్తితో దాడి

చిన్నారికి తీవ్రగాయాలు, మరొకరికి స్వల్ప గాయాలు

అమలాపురం టౌన్, మే 14: సరిహద్దు తగాదాల నేపథ్యంలో గతంలో తన భార్యను హత్య చేసిన కేసులో ప్రతికారం తీర్చుకునేందుకు ఓ వ్యక్తి ప్రయత్నించాడు. ప్రత్యర్థి వర్గంపై మంగళవారం హత్యాయత్నానికి పాల్పడ్డాడు. కత్తితో చేసిన ఈ దాడిలో ఓ చిన్నారికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. 2021 మే 14న అమలాపురం ఎన్టీఆర్ మార్గ్‌లో డీఎస్పీ కార్యాలయానికి సమీపంలో తల్లీకొడుకులపై జరిగిన దాడిలో తల్లి కోండ్రు దుర్గ(45) అక్కడికక్కడే మృతి చెందింది. కుమారుడు రమేష్ తీవ్ర గాయాలపాలయ్యాడు. మినీ వ్యాన్‌లో మారణాయుధాలతో వచ్చిన మంగం బాలయోగి కుటుంబ సభ్యులు మూకుమ్మడిగా ఈ హత్యకు పాల్పడినట్లు అమలాపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో అప్పట్లో కేసు నమోదు చేశారు.

సరిగ్గా నేడు అదే రోజున..

ప్రత్యర్థి వర్గంపై పగతో రగలిపోతున్న హత్యకు గురైన దుర్గ భర్త కోటేశ్వరరావు పక్కా ప్రణాళికలతో సిద్ధమయ్యి మంగళవారం దాడి చేశాడు. పట్టణ సీఐ కె.క్రిస్టఫర్ అందించిన వివరాలు ప్రకారం... దుర్గ హత్య కేసులో వాయిదా నిమిత్తం మంగం బాలయోగి కుటుంబ సభ్యులు కోర్టుకు హాజరయ్యారు. వారు కోర్టుకు వస్తున్నారన్న సమాచారంతో ఆటో డ్రైవర్ అయిన కోటేశ్వరరావు పక్కా ప్రణాళికతో అమలాపురం వచ్చాడు. కోర్టు నుంచి తిరిగి వెళ్తుండగా బాలయోగి భార్య మంగ అనారోగ్యంతో బాధపడుతుండడంతో గనికమ్మ వీధిలో తాయత్తు తెచ్చుకునేందుకు వెళ్లాడు. ఈ లోపున బాలయోగి మనుమరాలైన గుణశ్రీని తీసుకుని బాలయోగి కుమారుడు విజయ్ మెయిన్‌రోడ్డులో నడిచి వెళ్తుండగా ఆటోలో వచ్చిన కోటేశ్వరరావు మాటువేసి ఒక్కసారిగా హత్యాయత్నానికి పాల్పడ్డాడు. కత్తితో చేసిన దాడిలో గుణశ్రీ తలకు తీవ్ర గాయమైంది. విజయ్‌కు స్వల్ప గాయమైంది. మెయిన్‌రోడ్డులో ఈ సంఘటన జరగడంతో స్థానికులు ఒక్కసారిగా కోటేశ్వరరావును చుట్టుముట్టి దేహశుద్ధి చేశారు. గాయపడ్డ గుణశ్రీని అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కోటేశ్వరరావును ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ క్రిస్టఫర్ తెలిపారు. అదే విధంగా కోటేశ్వరరావుపై జరిగిన దాడి ఘటనపై వారి కుటుంబ సభ్యుడు బాలయోగి తదితరులపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఇదిలా ఉండగా మెయిన్‌రోడ్డులోని చైతన్య టెక్నో స్కూలు ఎదురుగా జరిగిన దాడి సమాచారం తెలుసుకున్న డీఎస్పీ ఎం.మహేశ్వరరావు, పట్టణ సీఐ కె.క్రిస్టఫర్ హుటాహుటిన సంఘటనాస్థలానికి చేరుకుని గాయపడ్డ వారిని పోలీసు వాహనంలోనే ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్యం చేయించారు. మానవత్వం చాటుకున్న పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ ఎస్.శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించారు.



చికిత్స పొందుతున్న గుణశ్రీ

స్థానికుల దేహశుద్ధితో పడిఉన్న కోటేశ్వరరావు

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని ● ప్రత్తిపాడు ● జగ్గంపేట

పవన్ గెలుపుపై తీరప్రాంతాల్లో పందేలు

కొత్తపల్లి, మే 14: పిఠాపురం నియోజకవర్గ జనసేన కూటమి అభ్యర్థి పవన్‌కల్యాణ్ గెలుపుపై మండలంలోని తీరప్రాంతాల్లో జోరుగా పందేలు కాస్తున్నారు. సోమవారం జరిగిన పోలింగ్ ఫలితాల్లో పవన్ లక్ష ఓట్ల మెజార్టీతో విజయం సాధిస్తారని మత్స్యకారులు వైసీపీ వర్గీయులతో పందేలు కాయడం గమనార్హం. పవన్ గెలిస్తే రూ.లక్ష చెల్లిస్తామని.. ఒకవేళ వైసీపీ అభ్యర్థి గీత విజయం సాధిస్తే రూ.2లక్షలు చెల్లించాలని ఉమ్మడి పార్టీల నాయకులు చెల్లించాలన్న ఒప్పందాలు చేసుకున్నట్టు సమాచారం.

ప్రభంజనంలా కూటమికి ఓటు వేశారు

కాకినాడ సిటీ అభ్యర్థి వనమాడి కొండబాబు


కొండబాబు

కాకినాడ సిటీ, మే 14: ఆంధ్ర రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనను అంతమొందించి ప్రజా సంక్షేమ పాలన కోసం పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు ప్రభంజనంలా తరలివచ్చి కూటమికి ఓటు వేశారని కాకినాడ సిటీ అసెంబ్లీ టీడీపీ-జనసేన-బీజేపీ అభ్యర్థి వనమాడి కొండబాబు కృతజ్ఞతలు తెలిపారు. కాకినాడ సిటీ నియోజకవర్గంలో కూటమి గెలుపు కోసం టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు అహర్నిశలు శ్రమించారన్నారు. ప్రచారంలో పలుచోట్ల అన్ని వర్గాల ప్రజలు ఆదరణ చూపారన్నారు. తన బంధువులు, కుటుంబ సభ్యులు, మిత్రులు శక్తి వంచనలేకుండా కష్టపడ్డారన్నారు. అందరి ఆదరణ, ఆశీస్సులతో త్వరలోనే కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాబోతుందని ఆయన తెలిపారు.

కొండబాబుకు అభినందనలు..

స్థానిక జగన్నాధపురంలోని కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు నివాసం మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సందర్శకులతో సందడిగా మారింది. పుష్పగుచ్ఛాలు అందజేసి ముందస్తు అభినందనలు తెలిపారు. నగరంలోని వివిధ డివిజన్ల నుంచి టీడీపీ నాయకులు వచ్చి ఆయనను కలిశారు. ప్రాంతాల వారీగా ఓటింగ్ సరళి, మెజారిటీపై తమ అంచనాలు తెలిపారు.

అత్యధికంగా ఓటుహక్కు వినియోగించుకున్న బీసీలు

టీడీపీ పెరిక సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ బద్రి

కాకినాడ సిటీ, మే 14: ఎన్డీఏ కూటమి విజయం కోసం అత్యధికంగా బీసీలు ఓటు హక్కు వినియోగించుకున్నారని టీడీపీ పెరిక సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ వనపర్తి బద్రి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో అన్ని బీసీ సామాజిక వర్గాలు ఎన్డీఏ గెలుపే ధ్యేయంగా ఓట్లు వేశారన్నారు. జగన్‌రెడ్డి పరిపాలనలో బీసీలకు జరిగిన అన్యాయాలు, హత్యారాజకీయాలు, అణచివేతలు గుర్తు చేసుకుని పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారన్నారు. రాబోయే ఎన్డీఏ పాలనలో బీసీల జీవితాలలో మార్పులు వచ్చి మెరుగైన జీవనం సాగించగలరన్నారు. ఎన్డీఏ విజయం కోసం అన్ని బీసీ సామాజిక వర్గాలవారు శ్రమించారని బద్రి కృతజ్ఞతలు తెలిపారు.

'అత్యధిక మెజార్టీతో గెలవనున్న జ్యోతుల'

జగ్గంపేట, మే 14: టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తల కృషితోనే జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ అత్యధిక మెజార్టీతో గెలుపొందుతారని రాజపూడి కూటమి నాయకులు అన్నారు. కొన్నిఏళ్ల నుంచి ప్రతిపక్షంలో ఉండి ఎన్నో కష్టనష్టాలు చూశామని, ఎన్నికల నోటిఫికేషన్ నుంచి ముగిసే వరకు ప్రతీ ఒక్కరూ తమ గెలుపుగా భావించి ఎన్నికల్లో కష్టపడ్డారన్నారు. జగ్గంపేట ఎమ్మెల్యేగా నెహ్రూ, కాకినాడ ఎంపీగా తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ గెలుపొందడం ఖాయమని వారు పేర్కొన్నారు.

కార్యకర్తలు, నాయకులకు ధన్యవాదాలు

కాట్రావులపల్లి గ్రామ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులకు, అభిమానులకు, కార్యకర్తలకు ప్రతి ఒక్కరికి హృదయ పూర్వక నమస్కారాలు తెలుపుతున్నానని మునిరెడ్డి నాగేశ్వరరావు అన్నారు. గత 5ఏళ్లుగా పార్టీ కోసం కష్టపడి నేను ఏ కార్యక్రమం కోసం పిలిచినా వెంటనే నా వెంట నడిచిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. జూన్ 4న ఉమ్మడి ప్రభుత్వం రాబోతుందన్నారు. ఎన్నికలు ముగిశాయయని... ఏ ఒక్కరితోను వాదోపవాదాలు, ఎటువంటి విభేదాలు పెట్టుకోవదని ఆయన కోరారు.

18న జాబ్‌మేళా

కార్పొరేషన్ (కాకినాడ), మే 14: ప్రసిద్ధి చెందిన మల్టినేషనల్ కంపెనీ ఎల్అండ్‌టీలో ఉద్యోగులను నియమించుటకు ఐటీఐ పాసైన విద్యార్థులకు గవర్నమెంట్ ఐటీఐ కాకినాడ నందు ఈనెల 18వ తేదీన ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జాబ్‌మేళా జరుగుతుందని ప్రిన్సిపాల్ కన్వీనర్ వేణుగోపాల వర్మ తెలిపారు. ఐటీఐ(ఎన్‌టీసీ) పాసైన ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, సివిల్, వెల్డర్, ప్లంబర్, వైర్‌మాన్, కార్పెంటరీ, మాసన్ ట్రేడ్ విద్యార్థులతో సుమారు 1600 ఖాళీలను భర్తీ చేయడం జరుగుతుందన్నారు. ఎంపికైన విద్యార్థులకు మూడు నెలలు స్కిల్ ట్రైనింగ్ పూర్తి అయిన తర్వాత ఆంధ్ర, తెలంగాణ, చెన్నై, బెంగుళూరు రాష్ట్రాల్లో నియమిస్తారన్నారు. విద్యార్థులంతా ఒరిజినల్ సర్టిఫికెట్స్, ఒక సెట్ జెరాక్స్ కాపీలతో హాజరుకావాలని కోరారు.

ప్రయాణికులకు చల్లని నీడ


మూలపేట-కోనపాపపేట బీచ్‌రోడ్డులో గొడుగులా విస్తరించిన పచ్చనిచెట్లు

కొత్తపల్లి, మే 14: మండలంలో ఉప్పాడ నుంచి కోనపాపపేట వెళ్లే బీచ్‌రోడ్డుకు ఇరువైపులా గొడుగులా విస్తరించిన పచ్చని చెట్ల నీడలో ప్రయాణికులు ఆగి సేద తీరుతున్నారు. మూలపేట నుంచి సెజ్ పునవాసకాలనీ దాటి కోనపాపపేట వెళ్లే బీచ్‌రోడ్డులో ఇరువైపులా సుమారు కిలోమీటరు పొడవునా ఏపుగా పెరిగిన చెట్లు ప్రయాణికులకు చల్లని నీడ ఇస్తున్నాయి. తీర ప్రాంతాల్లో చిరువ్యాపారాలు చేసుకునే వర్తకులు మధ్యాహ్నం భోజనం చేసి ఈ చల్లని చెట్ల నీడలో ఎండకు కాసేపు విశ్రాంతి తీసుకుంటున్నారు. అలాగే దూరప్రాంతాల నుంచి తుని నుంచి బీచ్‌రోడ్డు మీదుగా కాకినాడకు వాహనాల్లో వెళ్లే ప్రయాణికులు చల్లని చెట్ల కింద ఆగి సేదతీరుతున్నారు.


'దాడికి పాల్పడినవారిని అరెస్ట్ చేయాలి'

కరప, మే 14: దాడికి పాల్పడినవారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ వేములవాడకు చెందిన పలువురు వైసీపీ నాయకులు, బీసీ, ఎస్సీ సంఘాల నాయకులు మంగళవారం రాత్రి కరప పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. కరప మండలం వేములవాడలో పోలింగ్ ముగిసిన పిదప ఇంటికి వెళ్తుండగా జనసేన కార్యకర్తలు తనను పరుష పదజాలంతో దూషించి దాడికి పాల్పడ్డారంటూ గ్రామ సర్పంచ్ భర్త కమిడి భీమశంకర్ ఆరోపించారు. కాకినాడరూరల్, వన్‌టౌన్ సీఐలు కె.శ్రీనివాస్, వి.సురేష్‌బాబు, గొల్లపాలెం, తిమ్మాపురం పోలీస్‌స్టేషన్‌ల ఎస్ఐలు, సిబ్బంది ఆందోళనకారులతో చర్చించారు. బుధవారం ఉదయం 10గంటల కల్లా నిందితులను అదుపులోకి తీసుకుని అరెస్టుచేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.

48 గంటలకు పైగా విధుల్లో పోలింగ్ సిబ్బంది

సామర్లకోట, మే 14: 2024 సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ సిబ్బంది, వివిధ స్థాయిలలో ఏర్పాటైన అధికారులు సుమారు 48 గంటలకు పైబడి విధులు నిర్వర్తించడం ఒక విధంగా రికార్డుగా చెప్పవచ్చు. సాధారణంగా ఎన్నికల పోలింగ్ సిబ్బంది పోలింగ్‌కు ముందురోజు ఉదయం 10 గంటలకు హాజరై పోలింగ్ సామాగ్రితో నిర్దేశించిన పోలింగ్ కేంద్రాలకు వెళ్లి సాయంత్రం వరకూ మాత్రమే విధులు నిర్వర్తించి పోలింగ్ ముగిసాక సదరు ఈవీఎంలను, సామాగ్రిని స్ట్రాంగ్ రూమ్‌లలో అప్పగించి తిరిగి రాత్రి 8 గంటల్లోపు ఇళ్లకు చేరేవారు. అయితే సోమవరం జరిగిన పోలింగ్ గతంలో ఎన్నడూ లేనిరీతిలో ఓటర్లు బారులు తీరడంతో పోలింగ్ సమయం ముగిసినా అప్పటికే క్యూలలో ఉన్నవారినందరినీ ఓటుహక్కు వినియోగించుకునేలా స్లిప్పులు ఇచ్చి పోలింగ్ కొనసాగించారు. ఇలా కొనసాగిన పోలింగ్ ఒక్కో ప్రాంతంలో 10 గంటల నుంచి అర్ధరాత్రి 1 గంట వరకూ జరగడం, తదుపరి సీళ్ళు, ప్యాకేజీలు వంటి పనులు పూర్తిచేసి స్ట్రాంగ్‌రూమ్‌కు తెల్లవారుజామున 3 నుంచి 5 గంటలవరకూ అప్పగించాల్సిరావడంతో పోలింగ్ విధులు నిర్వహించిన సిబ్బంది, అధికారులు 48 గంటలకు పైగా 55 గంటలు ఉండాల్సి వచ్చింది. గతంలో ఎన్నికల విధులు పూర్తిచేసి ఇంటికి చేరేసరికి చుక్కలు కనపడేవని, ఈసారి ఎన్నికల విధులు ముగించేసరికి సూర్యుడు కనబడ్డాడని విధులు నిర్వర్తించిన కొందరు ఉపాధ్యాయులు తమదైన శైలిలో పేర్కొనడం విశేషం. ఇది ఒక విధంగా పోలింగ్ సిబ్బందికి ఇబ్బందైనా ఎన్నికల విధులు కావడంతో ఎంతో ఓపికతో విధులు నిర్వర్తించిన సిబ్బంది, అధికారులను పలువురు ప్రజలు అభినందిస్తున్నారు.

యానాంలో పుదుచ్చేరి కమిషనర్ పర్యటన



యానాం, మే 14: పుదుచ్చేరి మున్సిపల్ కమిషనర్ కందస్వామి రెండు రోజుల పర్యాటనలో భాగంగా యానాం వచ్చారు. కమిషనర్‌తో పాటు పాటు సత్యనారాయనన్‌లు రోడ్డు మార్గన పుదుచ్చేరి నుంచి యానాం రాగా వారికి యానాం మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణా తదితర అధికారులు స్వాగతం పలికారు. ఇటీవల యానాంలో జరిగిన పేకాట క్లబ్బులకు సంబంధించి మున్సిపాలిటి ద్వారా ఇచ్చిన అనుమతులు, వాటి స్థితిగతులు తదితర అంశాలను పర్యవీక్షించనున్నట్టు తెలిసింది.

వెల్లివిరిసిన చైతన్యం!

» ఓట్లు వేయడానికి పోటెత్తిన ప్రజలు » పలుచోట్ల రికార్డు స్థాయిలో పోలింగ్ శాతం నమోదు


సర్పవరం జంక్షన్: కాకినాడ రూరల్ మండలంలో ఓ పోలింగ్ బూత్ వద్ద క్యూ కట్టిన ప్రజలు

సర్పవరం జంక్షన్, మే 14: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కాకినాడ రూరల్ నియోజకవర్గంలో సోమవారం జరిగిన ఎన్నికల్లో అధిక సంఖ్యలో మహిళలు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఉదయం 7 నుంచి ప్రారంభమైన పోలింగ్ అర్ధరాత్రి 12 గంటల వరకు జరిగింది. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో 2,69,330 మంది ఓటర్లు ఉన్నారు. అధికారులు కాకినాడ రూరల్, కరప మండలాలుతో పాటూగా అర్బన్ పరిధిలో గల 7 వార్డుల్లో 264 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పురుషులు 1,00,270మంది, మహిళలు 1,01,558 మంది, ఇతరులు 5 గురు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో ఉన్న 2,69,330 ఓటర్లలో 2,01833 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రికార్డు స్థాయిలో 74.93 శాతం ఓట్లు పోలయ్యాయి. ఇందులో కాకినాడ రూరల్ మండలంలో 1,14,480 మంది, అర్బన్ డివిజన్ పరిధి లోగల 1,2,3, 42,48,49,50 డివిజన్లతోపాటూ 47లో కొంత భాగంలో 32,012 మంది ఓటు వేశారు. కరప మండలంలో 55,341 మంది ఓటు హక్కు సద్వినియోగం చేసుకున్నారు. నియోజకవర్గంలో పురుష ఓటర్ల కంటే అదనంగా 1,288 ఓట్లు వేసి మహిళలు పైచేయి సాధించారు. సూర్యారావుపేట, వాకలపూడి, బొందగుంట, సర్పవరం భావనారాయణపురంలో మహిళలు ఓటు వేసేందుకు అర్ధరాత్రి వరకు పోలింగ్ కేంద్రాల్లో ఉండిపోవడం విశేషం. ఈవీఎంలు గంటల సేపు మొరాయించినా, క్యూ లైన్‌లో పడిగాపులు కాసి మరీ తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

కరపలో 85.84శాతం పోలింగ్

కరప, మే 14: కరప మండలవ్యాప్తంగా సోమవారం జరిగిన ఎన్నికల్లో 85.84శాతం పోలింగ్ నమోదైనట్టు అధికారులు తెలిపారు. మండలంలో మొత్తం 64,475మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 31,994మంది, మహిళా ఓటర్లు 32,481మంది ఉన్నారు. మండలంలోని 23 గ్రామాల్లో 66 పోలింగ్ కేంద్రాలు ఉండగా 27,901మంది పురుషులు, 27,440మంది మహిళలు వెరసి 55,341మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈవీఎంల మొరాయింపు, అధికారుల నిర్లక్ష్యం, అరకొర ఏర్పాట్లు తదితర కారణాలతో కొన్ని గ్రామాల్లో రాత్రి 10గంటల వరకు పోలింగ్ సాగింది.

జగ్గంపేటలో 83.65 శాతం

జగ్గంపేట, మే 14: నియోజకవర్గంలోని 4 మండలాలైన గండేపల్లి, గోకవరం, కిర్లంపూడి, జగ్గంపేట కలిపి మొత్తం 83.65శాతం ఓటింగ్ నమోదైంది. నియోజకవర్గంలో మొత్తం 2,29,863మంది ఓటర్లు ఉండగా 1,92,288మంది ఓటు హక్కు వినియోగించుకోగా అందులో పురుషులు 96,235, స్త్రీలు 96050, థర్డ్ జెండర్ ముగ్గురు ఉన్నట్లు అధికారిక లెక్కల్లో నమోదు చేశారు. గోకవరం మండలం కృష్ణునిపాలెం, సూదికొండ, జగన్నాధపురం, కిర్లంపూడి మండలం జగపతినగరం, జగ్గంపేట మండలం కాట్రావులపల్లి, రాజపూడి తదితర గ్రామాల్లో సాయంత్రం 6గంటలకు క్యూలలో ఓటర్లు నిలిచి ఉండిపోవడంతో వారందరికీ ఓటు హక్కు కల్పించారు. గతంలో 85శాతం పోలింగ్ నమోదైతే ఈసారి 83.65శాతం నమోదైంది. పోలింగ్ ముగిసిన తర్వాత ఈవీఎంలు, వీవీప్యాట్‌లను కాకినాడ స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ స్ట్రాంగ్ రూమ్‌ను సందర్శించారు.


ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ఏలేశ్వరంలో సోమవారం రాత్రి ఓ పోలింగ్‌బూత్ వద్ద ఓటర్లు

పెద్దాపురంలో 82.29 శాతం

సామర్లకోట, మే 14: పెద్దాపురం నియోజకవర్గంలో సోమవారం అర్ధరాత్రి వరకూ జరిగిన పోలింగ్ 82.29 శాతంగా నమోదైనట్టు పెద్దాపురం రిటర్నింగ్ అధికారి కార్యాలయ అధికారులు వెల్లడించారు. నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 2,15,095 మంది కాగా 1,76,993 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వారిలో పురుష ఓటర్లు 88,090 మంది కాగా మహిళా ఓటర్లు 88,895 మంది. ఇతరులు 8 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ పూర్తయ్యాక మంగళవారం తెల్లవారుజామున పోలింగ్ సామాగ్రి, ఈవీఎంలను ప్రత్యేక భద్రతా ఏర్పాట్ల మధ్య కాకినాడ జెఎన్‌టీయూ ఇండోర్‌స్టేడియానికి తరలించారు.

ప్రత్తిపాడులో 80.45 శాతం

ప్రత్తిపాడు, మే 14: నియోజకవర్గంలో 80.45 శాతం పోలింగ్ నమోదైందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీనివాసరావు వెల్లడించారు. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 217267 మంది ఉండగా పోలిన ఓట్ల సంఖ్య 174788. వారిలో పురుషులు87812, మహిళలు 86968 మంది, ఇతరులు8 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఆర్వో శ్రీనివాసరావు తెలిపారు.

దారుణంగా దెబ్బతిన్న రహదారులు

వాహనదారులకు తప్పని ఇబ్బందులు


అధ్వానంగా ఉన్న ఉత్తరకంచి రహదారి


దారుణంగా దెబ్బతిన్న పెద్దిపాలెం రహదారి

ప్రత్తిపాడు, మే 14: ప్రత్తిపాడు మండలంలోని రహదారులు దారుణంగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా ఉత్తరకంచి, పెద్దిపాలెం రహదారులు శిథిలమై ఛిద్రంగా మారాయి. గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు ఈ రెండు గ్రామాల రహదారులు బురదమయంగా అడుగుకోమడుగు మారడంతో వాహనదారులు, ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. మండలంలో ఏలూరు, పోతులూరు, వెంకటనగరం, తోటపల్లి, గజ్జెనపూడి, ధౌరువాక గ్రామాల్లోని రహదారుల పరిస్థితి ఇదే విధంగా ఉన్నాయి. మండలంలోని అధ్వాన్నంగా ఉన్న రహదారులను అధికారులు పునఃనిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఎండుతున్న చెరువులు

జగ్గంపేట, మే 14: జగ్గంపేట నియోజకవర్గంలోని గ్రామాల్లో రోజురోజుకి చెరువులు ఎండిపోతున్నాయి. వేసవి ప్రారంభం నుంచి విపరీతమైన ఎండలు కాయడం వల్ల చెరువులు పూర్తి ఎండిపోయాయి. ముఖ్యంగా జగ్గంపేట మండలం బావారం, నరేంద్రపట్నం, మన్యంవారిపాలెం, గుర్రప్పాలెం, గొల్లలగుంట, రాజపూడి తదితర గ్రామాల్లో రైతులకు మేలు చేసే చెరువులు చాలా ఉన్నాయి. గత సంవత్సరం వర్షాలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో పాటు పుష్కర ఎత్తిపోతల నీరు సరిగ్గా సరిపడకపోవడంతో సాగునీటితో పాటు పశువులకు కూడా తాగునీటికి ఇబ్బందులు ఏర్పడ్డాయి. విద్యుత్ బోర్ల ద్వారానే పాడిపశువులకు నీళ్లు అందిస్తున్నారు. చెరువులు ఎండిపోవడం, పుష్కరనీరు రాకపోవడంతో చాలా వరకు పంటలు కూడా ఎండిపోయాయి. ఎన్నికలు ముగిసినందున ఇప్పటికైనా అధికారులు స్పందించి పుష్కర నీటి సరఫరా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.


బావారంలో ఎండిపోయిన చెరువు

రికార్డు విజయం సాధించబోతున్న పవన్

» టీడీపీ శ్రేణులు అలుపెరగకుండా శ్రమించారు » మాజీ ఎమ్మెల్యే వర్మ


పిఠాపురం సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, మే 14: పిఠాపురం నుంచి కూటమి అభ్యర్థిగా పోటీ చేసిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్ రికార్డుస్థాయి మెజార్టీతో విజయం సాధించబోతున్నారని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. పిఠాపురం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ పవన్ విజయం కోసం తనతో పాటు టీడీపీ శ్రేణులంతా రాత్రింబవళ్లు అలుపెరగకుండా శ్రమించారని చెప్పారు. నియోజకవర్గంలో పవన్‌కు ఓటు వేసేందుకు ఓటర్లు భారీగా తరలివచ్చారని, అర్ధరాత్రి వరకూ ఓటింగ్ జరగడమే ఇందుకు నిదర్శనమని తెలిపారు. టీడీపీ పిఠాపురం నియోజకవర్గంలో బలంగా ఉందని, ఆ ఓటు అంతా పవన్‌కు బదిలీ అయిందని చెప్పారు. చంద్రబాబు నిర్ణయాలకు అనుగుణంగా తనతో పాటు కేడర్ అంతా పనిచేశారని, ఎవరితో వేలెత్తి చూపకుండా పనిచేశారని పేర్కొంటూ నాయకులు, కార్యకర్తలకు పాదాభివందనం చేస్తున్నారని తెలిపారు. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాల్లోని 50వార్డులు, 39 గ్రామాల్లో ప్రచారం నిర్వహించి అందరిని ఓటు అభ్యర్థించారని తెలిపారు. వైసీపీ నేతలు ఎన్నికల్లో నెగ్గేందుకు చేసిన కుట్రలు, నాటకాలు, జిమ్మిక్కులను ప్రజలు గుర్తించి తిప్పికొట్టారని చెప్పారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీతను పలు చోట్ల బూత్‌ల్లోకి రానివ్వలేదని, ఎక్కడిక్కడ ప్రజలు నిలదీశారని తెలిపారు. వైసీపీ దుష్టపరిపాలనకు చరమగీతం పాడాలనే కసితో ప్రజలు ఓటు వేశారని వర్మ చెప్పారు. సమావేశంలో టీడీపీ నేతలు కొండేపూడి సూర్యప్రకాష్, సకుమళ్ల గంగాధర్, అనిశెట్టి సత్యానందరెడ్డి, అల్లవరపు నగేష్, మలిరెడ్డి వెంకటరమణ, దొడ్డి నాగు, అడ్డగర్ల శివ తదితరులు ఉన్నారు.

కూటమి అభ్యర్థి సత్యప్రభకు అభినందనలు

ప్రత్తిపాడు, మే 14: నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభరాజాకు మంగళవారం అభిమానుల అభినందనలు వెల్లువెత్తాయి. నియోజకవర్గం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రత్తిపాడులోని తోటవీధిలో ఉన్న ఆమె స్వగృహానికి తరలివచ్చారు. ఎన్నికల్లో సత్యప్రభకు అనుకూలమైన వాతావరణం నెలకొందని అభిమానులు, కార్యకర్తలు సత్యప్రభను అభినందించారు. మండలంలోని వాకపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కురందాస్ అప్పలరాజు ఆధ్వర్యంలో సర్పంచ్ రొంగల నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ మురగా రమణ, మాజీ ఉపసర్పంచ్ గోకాడ చినబాబు, కురందాస్ చలపతిరావు బాబురావు తదితరులు సత్యప్రభను కలిసి అభినందించారు. అలాగే ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వతప్రసాద్ సోదరులు పర్వత సత్యనారాయణమూర్తి, పర్వత సుభాష్, ఎమ్మెల్యే మేనల్లుడు కొండమూరి చంబాబు పెద్ద ఎత్తున అనుచరగణంతో కలిసి వచ్చి సత్యప్రభను అభినందించారు. అలాగే రౌతులపూడి, శంఖవరం, ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండల నాయకులు ఇతంశెట్టి భాస్కరబాబు, బద్ది రామారావు, ఉల్లి వీరభద్రరావు, డాక్టర్ లక్ష్మీనారాయణ, బద్ది రమణ, కొమ్ముల కన్నబాబు, అమరాది వెంకట్రావు, జ్యోతుల పెదబాబు, చిక్కాల లక్ష్మణరావు, సత్యప్రభను మర్యాదపూర్వకంగా కలిశారు. జనసేన, బీజేపీ కార్యకర్తలు తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. సత్యప్రభ తేటగుంట వెళ్లి మాజీ మంత్రి యనమల రామకృష్ణుడుని మర్యాదపూర్వకంగా కలిశారు. తుని కూటమి అభ్యర్థి యనమల దివ్యతో సత్యప్రభ సమావేశమయ్యారు.


ప్రత్తిపాడు టీడీపీ కార్యాలయం వద్ద సత్యప్రభను అభినందిస్తున్న వాకపల్లి టీడీపీ నాయకులు

సీబీఎస్ఈ ఫలితాల్లో 'శ్రీ ప్రకాష్' విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

తుని రూరల్, మే 14: సీబీఎస్ఈ ప్రకటించిన పదో తరగతి, ప్లస్2 ఫలితాల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి మంచి ఫలితాలు సాధించారని విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయప్రకాష్ తెలిపారు. పదో తరగతి ఫలితాల్లో షేక్ నజ్బీన్ 500లకు 486, పెనుమత్స వర్షిణి 485, కృపాలిని పట్నోషి 484 మార్కులతో అగ్రగామిగా నిలిచారన్నారు. ప్లస్2 ఫలితాల్లో వెదురుపాక విజయ్ రిషి 91శాతం సాధించి అగ్రగామిని నిలిచి నూటికి నూరుశాతం ఉత్తీర్ణశాతంతో మ్యాథ్స్, తెలుగు సబ్జెక్టుకు 100కు 100 మార్కులు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు విద్యాసంస్థ అధినేత సీహెచ్‌కేవీ నరసింహరావు, ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు అభినందించారు.

నూకాలమ్మ జాతరలో భక్తుల రద్దీ


నూకాలమ్మ అమ్మవారు

పెద్దాపురం, మే 14: భక్తుల కొంగు బంగారం కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా ఆలయ కమిటీ సభ్యులు, ఈవో టీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మజ్జిగ, మంచినీరు సరఫరా చేశారు. సుమారు ఐదు వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ప్రమాదభరితంగా గొయ్యి


రౌతులపూడిలో రహదారి మధ్యలో ఉన్న గొయ్యి

రౌతులపూడి, మే 14: రౌతులపూడి గ్రామంలోని వెలమ కమ్యూనిటీహాల్ సమీపంలో రహదారి మధ్యలో గొయ్యి ప్రమాదభరితంగా మారింది. ఈ రహదారి గుండా రైతులు పొలాల్లోకి వెళ్లే దారికావడంతో ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఎస్సీ కాలనీకి వేళ్లే ప్రధాన రహదారి కూడా కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రైతులు పొలాల నుంచి ధాన్యం తరలించే సమయంతో గొయ్యితో ఇబ్బందులు పడుతున్నారు. గొయ్యి కింద మురికికాలువ ఉండడంతో చిన్న పిల్లలు గొయ్యిలో పడే ప్రమాదం ఉండడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పంచాయితీ అధికారులు స్పందించి ఈ గొయ్యి పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

సెల్‌షాపులో అగ్నిప్రమాదం

సుమారు రూ.15లక్షలు ఆస్తినష్టం

కాజులూరు, మే 14: కాజులూరులో ఓ మొబైల్‌షాపులో మంగళవారం అగ్నిప్రమాదం సంభవించింది. దీంతో సుమారు రూ.15లక్షల వరకు నష్టం జరిగినట్టు తెలుస్తుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాలు ప్రకారం.. కాజులూరు గ్రామానికి చెందిన బలభద్రుని కామేష్‌కి చెందిన మొబైల్‌షాపులో మంగళవారం మంటలు వ్యాపించాయి. సమాచారం తెలుసుకుని షాపు షెట్టర్ తెరిచే లోపు షాపులోని సామాగ్రి మొత్తం కాలి బూడిదయ్యాయి. షాపులో ఉన్న ఖరీదైన సెల్‌ఫోన్‌లు, స్మార్ట్‌వాచ్‌లు, ఇతర ఖరీదైన సామాగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు. రూ.15లక్షల వరకు ఆస్తినష్టం సంభవించిందని బాధితులు పేర్కొన్నారు. అయితే అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.


కాజులూరులో మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

పరిశుభ్రత కరువు!

» ఏలేశ్వరంలో అధ్వాన పరిస్థితులు
» అవస్థలు పడుతున్న ప్రజలు


ఏలేశ్వరంలో రహదారి చెంతనే పేరుకుపోయిన చెత్త

ఏలేశ్వరం, మే 14: ఏలేశ్వరంలో పరిశుభ్రత కరువుగా మారింది. నగర పంచాయితీలో పారిశుధ్యం అధ్వానంగా ఉండడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. డ్రైన్లలో పూడిక పేరుకుపోయి మురుగు నీరు ఇళ్ల వద్ద నిలిచిపోతుంది. పట్టణంలో మెక్కారావు కాలనీ, క్వారీపేట, సాయినగర్, లింగంపర్తి రోడ్డు పలు ప్రాంతాల్లో మురుగు రోడ్లపై ప్రవహిస్తోంది. దహదారులపై చెత్త పేరుకు పోవడంతో రాకపోకలకు ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. డ్రైనేజీలలో ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించకపోవడంతో మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తుంది. ఏలేశ్వరం నగర పంచాయితీ అయినప్పటికీ అభివృద్ధి మాత్రం శూన్యమని పలువురు ఆరోపిస్తున్నారు. పారిశుద్యం మెరుగుపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పందులు, దోమల బెడద

ఏలేశ్వరం నగర పంచాయితీ అధికారులు, సిబ్బంది నిర్ల క్ష్యం కారణంగా పట్టణంలో పెద్ద వీధిలో, శివాల యం వీధిలో, దిబ్బలపాలెం వీధుల్లో రహదారులపై చెత్త కుప్పలు కుప్పలుగా పేరుకుపోవడంతో పం దులు, దోమల బెడద ఎక్కువైందని స్థానికులు వాపోతున్నారు. నిర్లక్ష్యంగా రోడ్లపైనే ఆ వ్యర్థాలను వదిలేయడం వల్ల తిరిగి అవి గాలి, చిన్నపాటి వర్షాలకు డ్రైన్‌లోకి చేరుతున్నాయి. అనేక వ్యర్థాలను వ్యాపారులు కాలువల్లో వేస్తున్నారు. ప్రభుత్వం చెత్తపై పన్ను వెయ్యడం తప్ప చెత్త తొలగించడంలేదని ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


లింగంపర్తి రోడ్డులో కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు


మెయిన్ రోడ్డు కాలువలో పూడిక తీయకపోవడంతో నిలిచిన చెత్త